క్లుప్తంగా

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అధికారులు

సి.బెళగల్: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ కార్యాలయ అధికారిణి మంజుల అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యాక్రమాన్ని లైబ్రేరియన్ వెంకటరమణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్త కోట గ్రామ పంచాయతీ కార్యదర్శి వలిబేగ్ పాల్గొన్నారు. విద్యార్థులకు క్రీడా పోటీలు, పద్య, కవిత, కథా, గేయ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

గరిష్ట వేతనం పొందేలా పనులు చేయండి

సి.బెళగల్: ఉపాధి హామీ కూలీలు కొలత మేరకు పనులను చేసి గరిష్ట వేతనం రూ.272 పొందేలా చూడాలని ఏపీఓ లక్ష్మన్న అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని పోలకల్, కంబదహాల్, బ్రాహ్మణదొడ్డి గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ కూలీల హాజరును పరిశీలించి మస్టర్ సమర్థవంతంగా నిర్వహించేందుకు మేటీలకు సూచనలు చేశారు. అదేవిధంగా పని ప్రాంతంలో కూలీలకు అందాల్సిన సేవలు, వసతులు, సౌకర్యాలను కల్పించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని టీఏలను ఆదేశించారు.

32వ వార్డులో కమిషనర్ పర్యటన



ముజఫర్ నగర్ రైతు బజార్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవతేజ

కల్లూరు : కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో కమిషనర్ భార్గవ తేజ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ముజఫర్ నగర్‌లోని రైతు బజార్‌ని పరిశీలించారు. కార్పొరేటర్ సాన శ్రీనివాసులు రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కమిషనర్‌ను కోరారు.

పాఠశాలలకు విద్యా కానుక కిట్లు



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఓర్వకల్లు: ప్రభుత్వం సరఫరా చేసిన విద్యా కానుక కిట్లను ఆయా పాఠశాలలకు చేరవేస్తున్నట్లు ఎంఈఓ సునంద తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని 7,457 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు వచ్చినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 46 పాఠశాలలు ఉండగా, అందులో 26 ఎంపీపీఎస్, 8 యూపీఎస్, 10 జెడ్పీహెచ్ఎస్, రెండు ప్రత్యామ్నాయ పాఠశాలలు ఉన్నాయని వెల్లడించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో శ్రీ అంభయాంజనేయస్వామి ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజులుగా పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాలతో కచేరీ చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామం వద్ద సుమారు 53 అడుగుల అభయాంజస్వామి విగ్రహం నిర్మించి 5సంవత్సరాలు పూర్తి బళ్లారి బాలనందస్వామి వారిచే శనివారం ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

గర్భిణులకు వైద్య పరీక్షలు



మందులను అందజేస్తున్న డాక్టర్ తేజశ్విని

గడివేముల: ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తేజశ్విని సూచించారు. ప్రతి నెల 9వ తేదీన నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ రాజ్ కుమార్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు జగనన్న కానుకలు సిద్ధం

- పాఠశాలలు తెరిచిన రోజే పంపిణీకి చర్యలు
- ఇప్పటికే హెచ్ఎంలకు కిట్లను అందజేసిన విద్యాశాఖ అధికారులు
- మండలంలో 38 ప్రభుత్వ పాఠశాలలో 3,743 మంది విద్యార్థులు

గడివేముల: సర్కారీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న జగనన్న విద్యాకానుకలు బడులు ప్రారంభించిన మొదటి రోజే (ఈనెల 12న) పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు కానుకల కిట్లను మండల విద్యాశాఖ కార్యాలయాల నుంచి ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాఠశాలలకు చేరవేస్తున్నారు. మండల కేంద్రాలలోని జెడ్పీ హైస్కూల్లో సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు, కానుకలను అధికారులు పరిశీలించి ఆయా స్కూళ్లకు సరఫరా చేస్తున్నారు.

నెల రోజుల ముందుగానే సరఫరా

నెల రోజుల ముందుగానే కానుకలను ప్రభుత్వం మండలాలకు సరఫరా చేసింది. ఇందులో విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్స్, బెల్ట్, రెండు జతల యూనిఫాం, నోట్ పుస్తకాలు, డిక్షనరీ ఉన్నాయి.

3,743 మంది విద్యార్థులకు

గడివేముల మండలంలో 3,743 మంది విద్యార్థులకు జగన్న విద్యా కానుకలు అందిస్తున్నారు. పాఠశాలకు వచ్చిన రోజునే కానుకల కిట్లు అందజేయనున్నారు. మండలానికి అవసరమైన పుస్తకాలను మూడు విడతల్లో ప్రభుత్వం సరఫరా చేసింది. 43,370 పాఠ్య పుస్తకాలను సిద్ధం చేశారు. ఇంకా 19,625వేల పుస్తకాలు రావలసి ఉందని అధికారులు చెబుతున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు యూనిఫాంలు 3,743 జతల చొప్పున అందిస్తారు. అలాగే 6 నుంచి 10వ తరగతి 2009 విద్యార్థులకు 20,880 నోట్ పుస్తకాలు, 403 మంది 6వ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందిస్తారు. 1 నుంచి ఐదో తరగతి 592 మంది విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీ అందజేయనున్నారు.



పంపిణీకి సిద్ధంగా జగనన్న విద్యాకానుకలు



విద్యాకానుకలను ఆటోలో పాఠశాలలకు తరలిస్తున్న దృశ్యం

విద్యార్థులకు ఎంతో మేలు



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు అందించాలనే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద విద్యార్థులకు ఎంతో మేలు జరగుతుంది. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లలను పంపించేందుకు అనాశక్తి చూపే తల్లిదండ్రులు నేడు ప్రభుత్వ పాఠశాలకు పోటీపడి పంపిస్తున్నారు. సాంకేతిక విద్యను అందిపుచ్చుకుని మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యాంశాల బోధనకు స్మార్ట్ టీవీలు ఎంతో ఉపయోగపడతాయి. ఇంగ్లిష్ భాషను బాగా చదువుకోవడానికి డిక్షనరీలు ఎంతో ఉపయోగకరం. ప్రభుత్వ పాఠశాలలో ఇన్ని సదుపాయాలు ఎప్పుడూ చూడలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికి కావాల్సిన అని సదుపాయాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యాకానులను అందిస్తున్నారు. ఇప్పటికే మా పాఠశాలలో 102 మంది విద్యార్థులకు అవసరమైన విద్యాకానులు సిద్ధంగా చేశాము. పాఠశాలలో పునఃప్రారంభం రోజునే కానుకలు అందిస్తామన్నారు. **–రవికుమార్, హెచ్ఎం, ఎంపీపీ పాఠశాల, బూజునూరు**

తొలి రోజే కానుకల పంపిణీ



వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12న ప్రభుత్వ బడులు తెరుచుకుంటాయి. అదే రోజునే పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుకల కిట్లను పంపిణీ చేస్తాం. విద్యార్థులకు అవసరమైన కానుకలను మండల కేంద్రంలో సిద్ధం చేశారు. వాటిని పాఠశాలలకు పంపిస్తున్నాం. మండలంలో 38 పాఠశాలల్లో 3,743 మంది విద్యార్థులకు గాను 43,370 పాఠ్య పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి.

– రామకృష్ణుడు, మండల విద్యాశాఖాధికారి, గడివేముల

నేడు విద్యుత్ కోతలు

కోడుమూరు : విద్యుత్ సబ్‌స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, 33 కేవీ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ జేసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.న వినియోగదారులు, రైతులు, వ్యాపారస్తులు కరెంట్ కోత వేళలను గమనించి తమ పనులను చేసుకోవాలని సూచించారు.

కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు శుక్రవారం డ్యాం అధికారులు తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. డ్యాంలో 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

షెడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం దిన్నెదేవరపాడులోని వర్మీ కంపోస్టు షెడ్డు నిర్మాణం 12 రోజుల్లో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్‌ను కర్నూలు ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు వర్మీ కంపోస్టు షెడ్డును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య లోపించకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లదేనని అన్నారు. ఈయన వెంట పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ ఉన్నారు.

అర్హత ఉన్న వారందరికీ ఇళ్ల స్థలాలు



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఓర్వకల్లులో గడప గడపకు మన ప్రభుత్వం
- లబ్ధిదారులకు పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే

ఓర్వకల్లు : అర్హత ఉన్న వారందరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అనానర్. మండల కేంద్రంలో నిరుపేదలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఇళ్ల పట్టాలను శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పంపిణీ చేయడంతో పండుగ వాతావరణం నెలకొంది. పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రామంలో వరుసగా నాలుగవ రోజున ఎమ్మెల్యే ఎస్సీ కాలనీలలో పర్యటించారు. ఒకవైపు దళితుల సమస్యలను తెలుసుకుంటూనే, జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గూర్చి కాలనీ ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీలను విస్మరిస్తే, ప్రస్తుత ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డి దక్కుతుందన్నారు. పేద పిల్లలకు బడిబయట ఉండరాదనే సంకల్పంతో అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, విద్యా కానుక, వసతి దీవెన వంటి పథకాలతో పాటు సంపూర్ణమైన పౌష్టికాహారం అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సర్పంచు తోట అనూష, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు మద్దిలేటి, ఏసేపు, కృపయ్య, కిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం రాయితీపై సూక్ష్మపోషకాలు

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సూక్ష్మపోషకాలైన జింక్, జిప్సంను వందశాతం, పిల్లిపెసర, జీలుగ 50 శాతం రాయితీపై అందజేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయ పరికరాలు, యంత్రాలను 50 శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుందని తెలియజేశారు. యంత్రాలు అవసరమైన రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలోపలు అంశాలపై సభ్యులు, వ్యవసాయ సిబ్బందితో చర్చించి రైతు భరోసా కరదీపికల సంచికలను రైతులకు అందజేశారు.

అనుమతులున్న విత్తనాలనే అమ్మాలి


రైతులకు ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నిర్ణీత ఎంఆర్పీలకే అమ్మకాలు జరపాలని ఏఓ మల్లేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. వారు మాట్లాడుతూ నిషేధిత మందులు, విత్తనాలు అమ్మినట్‌లైయితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీఈఓ ఈశ్వర్, వీఏఏస్ హిమబిందు తదితరులు ఉన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

చురుగ్గా ఆర్బీకే నిర్మాణ పనులు

గూడూరు రూరల్ : మండల పరిధిలోని కె.నాగలాపురంలో చేపట్టిన రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, యంత్ర సామగ్రిని అందించేందుకు, పంటల సాగులో రైతులకు అవసరమైన మెలకువలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ఆర్బీకేలను ఏర్పాటు చేసింది. సొంత భవనం లేకపోవడంతో ఆర్బీకేను ప్రస్తుతం అద్దె భవనంలో ఏర్పాటు చేసి కార్యకలాపాలను సాగిస్తున్నారు. ప్రభుత్వం ఆర్బీకేకు సొంత భవనం ఏర్పాటు చేసేందుకు గతేడాది రూ.21.80 లక్షలు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ భవన నిర్మాణాన్ని చురుగ్గా కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం భవనం పైకప్పు పూర్తి కావడంతో 80 శాతం మేరకు పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు రెండు నెలల్లో పూర్తి చేసి, ఆర్బీకేను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు పీఆర్ ఏఈ గోపాల్‌రావు తెలిపారు.



కె.నాగలాపురంలో నిర్మితమవుతున్న ఆర్బీకే భవనం

రోడ్డుపైనే మురుగు

కల్లూరు : మండల పరిధిలోని లక్ష్మీపురంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. హంద్రీ నది పక్కన అనుగొండ రోడ్డులో ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపై నిలుస్తోంది. ఇళ్లలో నుంచి మురుగు నీరు హంద్రీలో చేరేల డ్రైనేజీ కాలువ నిర్మించారు. అయితే కాలువలు సరిగా లేకపోవడంతో మురుగు నీరు మధ్యలోనే రోడ్డుపై చేరడంతో గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరిహారం కోసం అంత్యక్రియలు అడ్డగింత

గడివేముల: పరిహారం ఇవ్వలేదని పాడేను బాధితులు అడ్డుకున్న వైనం మండలంలోని కొర్రపోలూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామంలో దళితవాడకు శ్మశాన వాటిక లేక చాలా ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని గ్రామానికి చెందిన రైతు పోలాద్రి ఐదేళ్ల క్రితం తనకున్న అర ఎకరం పొలాన్ని దళితుల శ్మశాన వాటిక కోసం ప్రభుత్వానికి అప్పగించారు. అయితే ఇంత వరకూ పరిహారం చెల్లించకపోడంతో ఆయన కుటుంబసభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. కాగా, శుక్రవారం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చనిపోగా విషయం తెలుసుకున్న బాధితులు శ్మశానం వద్దకు వెళ్లి శవాన్ని పూడ్చకుండా అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకున్నారు. బాధితులకు పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసులు హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమనిగింది.



కొర్రపోలూరులో బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- ప్యాలకుర్తిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్: ప్రజల గడప వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, దిశ కమిటీ సభ్యులు రమేష్‌లతో కలిసి ఇంటింటికీ తిరిగారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోపాల్ నగర్ కాలనీవాసులు తమ కాలనీలో మురుగునీటి కాల్వలను నిర్మించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరరు. తాము గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించుకున్నా ఇంకా పూర్తి బిల్లులు మంజూరు కాలేదంటూ తెలుగు ఆదెన్న, మాదన్న, శ్రీనివాసులు అనే వ్యక్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. మురుగునీటి కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ గంగ రాజులకు ఎమ్మెల్యే సూచించారు. అలాగే ఇంటి నిర్మాణ బిల్లులు మంజూరుగాని వారి జాబితా సిద్ధం చేసి నివేదిక పంపాలని హౌసింగ్ డీఈఈ వాసుదేవరావును ఆదేశించారు.

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఘనత జగనన్నదే

ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రజలంతా సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. జగనన్న పాలనలో గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలందుతుండడంతో ప్రజలంతా సుఖసంతోషాలతో విరాసిల్లుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఓ రవిప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగరాజు, స్థానిక నేతలు శ్రీనివాసులు, మిన్నెల్ల, సీతారాముడు, వార్డు మెంబర్లు సోమన్న, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

కోడుమూరు రూరల్: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్. అంబేడ్కర్ ఆశయాల సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ కలలుగన్న సామాజిక న్యాయాన్ని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిజం చేస్తూ వెనుకబడిన వారికి చేయూతనందిస్తూ నేడు అన్నింటిలోనూ ప్రోత్సహిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు మల్లేష్, ప్రహ్లాదరెడ్డి, మధు, గోకారి, మద్దిలేటి, అయ్యస్వాములు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డా.సుధాకర్

అంబేడ్కర్‌కు నివాళులర్పించిన డాక్టర్ ఆదిమూలపు సతీష్

మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ నివాళులర్పించారు. ఆయన వెంట బహుజన ఐక్య వేదిక అధ్యక్షుడు కిరణ్, గ్రామస్తులు మద్దిలేటి, రాముడు, సిద్దయ్య, రాజు, చిన్న రాముడు ఉన్నారు.

మిద్దెపై నుంచి పడి విద్యార్థిని మృతి



తేజస్విని(ఫైల్)

గూడూరు: పట్టణానికి చెందిన కె.తేజస్విని(18)అనే విద్యార్థిని ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి మృతి చెందింది. ఇన్‌చార్జ్ ఎస్ఐ పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. తూర్పు బీసీ కాలనీకి చెందిన ఎల్లప్ప, భూలక్ష్మి కుమార్తె అయిన తేజస్విని స్థానిక ఎస్ఎస్‌వీ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుంది. శుక్రవారం ఈ విద్యార్థిని మిద్దెపై బట్టలు ఆరవేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కింద పడింది. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందింది. ఈ మేరకు తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ప్యాలకుర్తిలో 'గడప గడపకు'

కోడుమూరు రూరల్ : మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుంటారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి

పాణ్యం: వర్గీకరణతోనే మాదిగల జీవితాలోల వెలుగులు వస్తాయని, దేశంలోని మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబాటుకు కారణం ఏబీసీడీ వర్గీకరణ చేయకపోవడమేనని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ అన్నారు. శుక్రవారం పాణ్యంలో ఎస్సీ కాలనీలో గో టూ 50 డేస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. పార్టీలు ఓట్ల కోసం వర్గీకరణ చేస్తామని మోసం చేస్తున్నాయన్నారు. త్వరలో మందకృష్ణ మాదిగ చేపట్టే భారీ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబు, చిరంజీవి, చంద్రబాబు, నాగరాజు , రమేష్, అశోక్, సుబ్బరావు, పక్కీరయ్య, పెద్ద స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

కల్లూరు : రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తోందని కల్లూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏడాది ఖరీఫ్ సీజనల్‌లో పెట్టుబడి సాయం అందిస్తున్నారన్నారు. డీఆర్‌సీ ఏఓలు హేమలత, నాగసరోజమ్మ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు (జెబిఎస్ఎఫ్) మల్లాలన్నారు. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందని దాంతోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చాన్నారు. కంది మినికిట్స్ గురించి చర్చించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ సలహామండలి చైర్మన్ కేశవరెడ్డి

కొలతల ప్రకారం పనులు చేయాలి

కర్నూలు (న్యూటౌన్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కొలతల ప్రకారం చేయాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు దినసరి వేతనం కనీసం రూ.272 పడేలా పనులు కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలు నివారించి అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు ఇచ్చి, పనులు చూపాలని ఆదేశించారు. రాబోయే వర్షాకాలంలో ఉద్యాన పంటలు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే చీనీ, మామిడి, నిమ్మ, జామ, ఆపిల్ బేర్, చింత, డ్రాగన్‌ఫ్రూట్, గుండు మల్లెలు, గులాబీ పూల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద 100 శాతం సబ్సిడీతో పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు.. ఈ అవకాశాన్ని ఐదెకరాల్లోపు చిన్న, సన్నకారు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నందనపల్లెలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ప్రతి రోజూ 'స్పందన' నిర్వహించాలి

కర్నూలు (న్యూటౌన్): గ్రామ సచివాలయంలో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు 'స్పందన' కార్యక్రమాన్ని తప్పకుండా నిర్వహించాలని కర్నూలు ఎంపీడీఓ ఎంఏ అజాంఖాన్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 'స్పందన'లో వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగు నీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, శానిటేషన్ సమస్యలు లేకుండా చూసుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ అజాంఖాన్